

పలిమెల : మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

ప్రశ్నించే గొంతుకనవుతా..

- హామీల పేరుతో కాంగ్రెస్ మోసం చేస్తున్నది
- బీఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కాటారం/పలిమెల, ఏప్రిల్ 28 : ప్రజలు ఆదరిస్తే ప్రశ్నించే గొంతుకనై కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగడతానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మహాముత్తారం, పలిమెల మండలాల్లోని బోర్ల గూడెం, పంకెన గ్రామాల్లో ఆదివారం ఆయన పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలి సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం, అభివృద్ధికి దేశంలోనే మరెక్కడా లేని పథకాలను తీసుకువచ్చారని, రైతు బంధు, రైతు బీమా పథకాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిందని, వాటిని అమలు చేయకపోడంతో ఆ పార్టీ ప్రజల్లో నమ్మకం కోల్పోయిందన్నారు. రైతుబంధు, రుణమాఫీ, దళిత బంధు ఇవ్వకుండా అందరిని ఆగం పట్టిస్తున్నదని వాపోయారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో, అప్పటి ఎమ్మెల్యే పుట్ట మధు మారుమూల గ్రామాల్లో రింగు రోడ్లు, అన్ని వాగులపై వంతెనలు నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఒకవైపు రైతుల పంటల పొలాలు ఎండిపోయి అరిగోస పడుతుంటే సర్కారు చోద్యం చూస్తున్నదని, కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరం కూడా ఎండలేదన్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి జరగాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఈశ్వర్ కోరారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా యువజన నాయకుడు జక్కు రాకేశ్, పలిమెల, మహదేవపూర్ మండలాధ్యక్షులు జవ్వాజి తిరుపతి, లింగంపల్లి శ్రీనివాసరావు, నాయకులు మార్క రాము గౌడ్, రాజిరెడ్డి, రూపా నాయక్, వసంత, లక్ష్మి, రాదారపు స్వామి, మెండ వెంకటస్వామి, బొబ్బిలి వెంకయ్య, జైపాల్, ధరమ్‌సింగ్, జగపతి, లగారి రవీందర్, అలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఎన్ఎంసీ దాడులను ఖండిస్తున్నాం

ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 : ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) చేస్తున్న దాడులను తాను పూర్తిగా ఖండిస్తున్నానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఎంపీ, పీఎంపీలు పల్లెలకు పట్టుగొమ్మలని, గ్రామాల్లో రాత్రి పగలు తేడా లేకుండా రోగులకు సేవలందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో గ్రామీణ వైద్యుల సేవలు మరువలేనివని, వారి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు రాంనర్సింహారెడ్డి, గాజర్ల అశోక్, కత్తి వెంకటస్వామి, హరిబాబు, వెంకన్న, గన్నారపు రమేశ్, ఎల్లోజు నరసింహాచారి, రాయమల్లు, సుధాకర్, శ్రీనివాస్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎంజేపీ ప్రవేశ పరీక్ష

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 28 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరు పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని డీఈవో ఎన్ రాంకుమార్, జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి జిల్లా వ్యాప్తంగా 246 మంది దరఖాస్తు చేసుకోగా 210 మంది, జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి 1039 మందికి 948 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రాలను జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఏసీజీఈ మందల రవీందర్‌రెడ్డి, పరీక్షల సహాయకులు కృష్ణమోహన్, రూట్ ఆఫీసర్ వెంకటరమణ తనిఖీ చేసినట్లు వారు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

LOST DOCUMENT

★I, KUMMARI SANDEEP KUMAR, S/o. K.SAMPATH, H.No. 1-1-1191, Siddhartha Nagar, Babu Camp, Kazipet Mdl., Hanumakonda Dist., My Original Link Document No. 5363/2012 has been lost while Shifting from Fathima Nagar to Venkatadri Nagar, If found please cont. 9000075833. NTW-00

WANTED

★Wanted boys for car & bike wash for a reputed company. Contact Cell No. 7901691665. NTW-00

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899, 9640468899 NT-311840

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043. NTW-323227

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618

WARANAGAL 9182777556 9182777557

JAYASHANKAR BHUPALPALLY - 9182777559

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777554

JANGAON - 9182777565

రెడ్ అలర్ట్

- నిప్పుల కొలిమిలా గోరికొత్తపల్లి
- రెండో స్థానంలో తాడిచర్ల
- వాతావరణశాఖ ప్రమాద హెచ్చరిక

జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 45.2 డిగ్రీలు నమోదైంది. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. గత వారం రోజులుగా జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైనే నమోదవుతున్నాయి. కాగా ఆదివారం జిల్లాలోని గోరికొత్తపల్లి మండల కేంద్రం నిప్పుల కొలిమిలా మారింది. అక్కడ 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ ప్రమాద హెచ్చరిక జారీ చేసింది. అలాగే మల్హర్ మండలం తాడిచర్లలో ఉష్ణోగ్రత 44.5 డిగ్రీలకు చేరింది. ఇప్పటికే వాతావరణశాఖ ఏప్రిల్ 28 నుంచి మే 2 వరకు ఎండ తీవ్రత పెరిగే అవకాశముందని, ఉదయం 11 గంటలు దాటితే ఎవరూ బయట తిరగొద్దని, తప్పనిసరైతే జాగ్రత్తలు తీసుకోవాలని ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం గోరికొత్తపల్లిలో 45.2, తాడిచెర్లలో 44.5, మహాముత్తారం, మొగుళ్లపల్లి, సర్వాయిపేట, చెల్పూర్, కాటారం, రేగొండ, చిట్యాల మండలాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత శుక్ర, శనివారాల్లో సైతం పలు మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. ముఖ్యంగా జిల్లాలోని రేగొండ, గోరికొత్తపల్లి, మల్హర్, చిట్యాల, కాటారం మండలాల్లో అత్యధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ రిపోర్టును బట్టి తెలుస్తున్నది.

ఏజెన్సీలో మండుతున్న ఎండలు..

ఏటూరునాగారం : ఏజెన్సీలో ఎండలు మండుతున్నాయి. రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఇంకా గోదావరి తీర ప్రాంతాల్లో మరింత ఎక్కువగా కన్పిస్తోంది. గోదావరి పూర్తిగా ఎండి పోవడంతో కిలోమీటర్ల కొద్ది ఇసుక కన్పిస్తుంది. ఎండ తీవ్రతకు వేడెక్కిన ఇసుక వడ గాడ్పులకు తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఏటూరునాగారానికి ఒక వైపు వాగు, రెండు వైపులా గోదావరి ఇసుక ఉండడంతో వేడిమి తీవ్రత ఎక్కువగా కన్పిస్తోంది. ఆదివారం ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులను ఉదయం 5 గంటలకు ప్రారంభించి 9 గంటల వరకు ముగిస్తున్నారు. వడ దెబ్బకు లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న భూపాలపల్లి పట్టణం, ఏటూరునాగారం బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారులు

స్వయం ఉపాధి శిక్షణను వినియోగించుకోవాలి

ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగురూరల్, ఏప్రిల్ 28 : జిల్లాలోని మహిళలు, యువత స్వయం ఉపాధి శిక్షణను వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలో హసన్‌పర్తి గ్రామంలో గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ పూర్తయ్యే దాకా భోజనం, వసతిని ఉచితంగా కల్పించనున్నట్లు తెలిపారు. టైలరింగ్, బ్యూటీపార్లర్, జ్యూట్ బ్యాగ్, సెల్‌ఫోన్ రిపేర్, సీసీటీబీ ఇన్‌స్టాలేషన్, ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్, బైక్ రిపేరింగ్, ఫొటో, వీడియో గ్రాఫ్, ప్లంబింగ్, శానిటరీ, ఏసీ, ఫ్రిజ్, ఎలక్ట్రికల్ మోటార్ రిపేర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, నెట్ వర్కింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా మెన్స్‌పార్లర్, అగర్బత్తి, పౌల్ట్రీ, ఫాస్ట్‌ఫుడ్ తయారీ, లామినేషన్ తదితర వాటిపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణకు 18 నుంచి 45 ఏండ్ల వయస్సు వారు అర్హులన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత, అణుత్తీర్ణులైన వారికి కూడా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డ్, 4 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలతో మే10వ తేదీలోగా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ ఫోన్ నంబర్ 9194930383ను సంప్రదించాలన్నారు.

ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

- భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, వైస్ చైర్మన్ హరీశ్‌రెడ్డి
- కేసీఆర్ రోడ్ షోకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కేసీఆర్ రోడ్‌షోకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్‌లో గులాబీ జెండా ఎగురడం ఖాయమని భూపాలపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి అన్నారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ తరుపున కేసీఆర్ ఆదివారం హనుమకొండలో నిర్వహించిన రోడ్ షోకు జిల్లా కేంద్రం నుంచి బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పటేల్ ఆధ్వర్యంలో 100 వాహనాల్లో సుమారు 500 మంది ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రెడ్డి గులాబీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారన్నారు. దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అసలు రంగు ప్రజలకు అర్థమవుతున్నదని, ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోరని, సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. తరలిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేశ్, భక్తాంజనేయ దేవాలయ కమిటీ చైర్మన్ గడ్డం కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎం తిరుపతి, నూనె రాజు పటేల్, మౌనికా శ్రీనివాస్, దార పూలమ్మ, టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, నాయకులు బండారి రవి, మాడ హరీశ్‌రెడ్డి, నాగుల దేవేందర్‌రెడ్డి, పోలవేని అశోక్, నలిగేటి సతీశ్‌కుమార్, మామిడి కుమార్, మేకల మల్లేశ్, స్వామి, శ్రీనివాస్, లక్ష్మణ్, తిరుపతి, జోరు ఈశ్వర్, లక్కం దేవేందర్, మోతె రాజు, కప్పంపెల్లి శేఖర్, ప్రేమ్‌కుమార్, గోగు మల్లయ్య, దొంగల శంకర్, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేస్తాం

మంత్రి శ్రీధర్‌బాబు

స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి

కాటారం, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికలు ముగియగానే ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మండలంలోని ధన్వాడ, విలాసాగర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అన్ని పథకాలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండలంలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐ నాగార్జునరావును ఆదేశించారు. అనంతరం విలాసాగర్‌లోని మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, నాయకులు విలాస్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, కోట రాజబాబు, వామన్‌రావు, చీమల సందీప్, అందె సత్యనారాయణ, జాడి మహేశ్వరి, చీటూరి మహేశ్, దండు రమేశ్, రాజిరెడ్డి, కొట్టె ప్రభాకర్, సదానందం, సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరంలో కలెక్టర్ దంపతుల పూజలు

కాళేశ్వరం, ఏప్రిల్ 28 : శ్రీ కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి ఆలయంలో భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా, ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలోకి చేరుకొని గణపతి వద్ద పూజలు చేశాక స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి పార్వతి అమ్మవారి ఆలయానికి చేరుకొని పూజలు చేసిన అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రాలను అందజేశారు. వీరివెంట తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఆలయ పర్యవేక్షకులు బుర్రి శ్రీనివాస్ తదితరులున్నారు.

గుడుంబా విక్రేతలపై కేసు నమోదు

ములుగురూరల్, ఏప్రిల్ 28 : గుడుంబా విక్రేతలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని రామయ్యపల్లిలో గుడుంబా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు.. ఆదివారం ఎస్సై రామకృష్ణ సిబ్బందితో రామయ్యపల్లికి వెళ్లి గుడుంబా స్థావరాలపై దాడి చేశారు. ఈ దాడుల్లో పొరిక వెంకట్రాం వద్ద 5 లీటర్ల గుడుంబా, 100 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించినట్లు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన పొరిక లక్ష్మి వద్ద 2 లీటర్ల గుడుంబా, 50 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి, ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్మికులను ఎండ తీవ్రత నుంచి కాపాడండి

పని వేళల్లో మార్పులు చేయండి ■ మజ్జిగ ప్యాకెట్లు అందించండి
టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ■ సింగరేణి సీఎండీకి లేఖ

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): సింగరేణి సంస్థలోని ఓపెన్‌కాస్టు గనుల్లో కార్మికులు మండుటెండల్లో విధులు నిర్వర్తిస్తున్నారని, వారిని ఎండ తీవ్రత నుంచి కాపాడాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) బలరాంనాయక్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో ఏప్రిల్ 28 నుంచి మే 2 వరకు ఎండలు తీవ్రంగా ఉంటాయని, 48 నుంచి 50 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిందని, కోల్‌బెల్ట్ ఏరియాల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఓపెన్‌కాస్టు గనుల్లో విధులు నిర్వర్తించే కార్మికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని, సింగరేణి సంస్థ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఓసీ కార్మికుల పని వేళల్లో మార్పు చేయాలని, మొదటి షిఫ్టు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, రెండో షిఫ్టు సాయంత్రం 4 నుంచి 11 గంటల వరకు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మజ్జిగ ప్యాకెట్లను అదనంగా సరఫరా చేయాలని, ఓసీలో మరిన్ని రెస్ట్ షెల్టర్లను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా కొనసాగిన సమయంలో పనివేళల్లో మార్పులు చేయించామని, మజ్జిగ ప్యాకెట్లను సరిపడా అందించామని గుర్తు చేశారు. యాజమాన్యం ఉత్పత్తే లక్ష్యంగా ముందుకు సాగకుండా ఎండల తీవ్రతను, కార్మికుల ఆరోగ్య పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని రాజిరెడ్డి కోరారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఏటూరునాగారం, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఈ నెల 29న ఆలయ వార్షికోత్సం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ నిర్మాణం పూర్తి చేసి 23 వసంతాలు కావస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఉదయం నుంచి అర్చనలు, ప్రత్యేకాభిషేకాలు నిర్వహించనున్నట్లు పూజారి భానుప్రకాశ్‌శర్మ తెలిపారు.

మల్లూరు ఆలయంలో భక్తుల సందడి

మంగపేట, ఏప్రిల్ 28 : మండలంలోని మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం చింతామణి జలపాతాన్ని సందర్శించారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి

తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ గౌడ్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 : కేంద్రంలో మార్పు రావాలంటే మతోన్మాద బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర వేదిక చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాలులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేసి, మనువాద రాజ్యాన్ని తీసుకువచ్చే కుట్ర పన్నుతుందన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పి, ఇప్పటి వరకు రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, బీజేపీ పాలనలో నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పూర్తిగా కోల్పోయారన్నారు. బీజేపీ పాలనలో విద్య, వైద్య రంగాలు వెనకబడటంతో పాటు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకాయన్నారు. తెలంగాణ బిల్లును ఇప్పటి వరకు సక్రమంగా అమలు చేయలేదన్నారు. దేశ సంపదను పూర్తిగా అదాని, అంబాని చేతుల్లో పెడుతున్న బీజేపీని ఓడించాలని వెంకటనారరాయణ కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకుడు ప్రొఫెసర్ సంగటి మల్లేశం, నాయకులు రాములు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటనారాయణగౌడ్

మడ్తపల్లిలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఓడిద్దాం

■ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిద్దాం ■ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర

రేగొండ, ఏప్రిల్ 28 : ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకొని తెలంగాణను కాపాడుకుందామని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. పారమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని లింగాల, మడ్తపల్లి, పొనగల్లు గ్రామాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో 420 హామీలు ఇచ్చిందని, ఇప్పటి వరకు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందడంతో పాటు సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరంకాంగ్రెస్ ఎమ్మెల్యేల అడ్రస్ ఉండదని, ఎవరూ కూడా గ్రామాలకు రారన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే బెదిరింపు చర్యలకు పాల్పడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని, అలాంటి నాయకుడికి ప్రజా మద్దతు ఉండదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించుకోవడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని గండ్ర పిలుపునిచ్చారు. సమావేశాల్లో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామాల పాపిరెడ్డి, జిల్లా నాయకులు ఇంగె మహేందర్, విద్యాసాగర్‌రెడ్డి, కుసుంబ రంజిత్, గంపల లింగయ్య, పేరాల ప్రశాంత్, బండి రమేశ్, గుర్రం తిరుపతి గౌడ్, ఎం నరేశ్, శ్రీకాంత్, చింటు తదితరులున్నారు.

రహదారిపై నిలిపిన వాహనాలకు జరిమానా

'నమస్తే' కథనానికి పోలీసుల స్పందన



రోడ్డుపై నిలిపిన లారీలకు జరిమానా విధిస్తున్న పోలీసులు

మహదేవపూర్, ఏప్రిల్ 28 : ప్రధాన రహదారిపై పార్క్ చేసిన లారీలు, ఇతర వాహనాలకు పోలీసులు జరిమానా విధించి తొలగించారు. ఈ నెల 27న 'ప్రధాన రహదారులపై లారీల పార్కింగ్' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఆదివారం ఎస్సై చక్రపాణి పోలీసులు చంద్ర మోహన్, కిషన్‌తో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిలిపిన వాహనాల యజమానులకు జరిమానా విధించారు. ప్రధాన రహదారులపై వాహనాలు నిలపొద్దని, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

మే డేను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 28 : మే ఒకటిన నిర్వహించే కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షుడు దావూద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. యావత్ ప్రజానీకం, మేధావులు, కార్మికులు, కర్షకులు ఈ వేడుకల్లో పాల్గొనాలన్నారు. వేడుకలకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించే ఉత్